ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
ఆదివారం 21 ఏప్రిల్ 2024



ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలిస్తున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్ 69.46 శాతమే

- గరిష్టంగా ధర్మపురిలో 81.48 శాతం
- అత్యల్పంగా సెంట్రల్ చెన్నైలో 53.91 శాతం

అడయార్, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల సమరంలో ఈసారి ఓటింగ్ శాతం తగ్గింది. నియోజకవర్గాల వారీగా ఆద్యంతం లెక్కలు తేల్చిన ఎన్నికల కమిషన్... ఓటింగ్ శాతం తగ్గినట్లుగా ప్రకటించింది. శుక్రవారం రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే.

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అయితే, పోలింగ్ ముగిసిన తర్వాత రాష్ట్రంలో 72.09 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ ప్రకటించింది. కానీ, రాష్ట్రంలోని అన్ని కేంద్రాల నుంచి వచ్చిన పోలింగ్ శాతాన్ని లెక్కించగా రాష్ట్ర వ్యాప్తంగా 69.46 శాతం పోలింగ్ జరిగినట్టు ఎన్నికల సంఘం శనివారం అధికారికంగా వెల్లడించింది. అత్యధికంగా ధర్మపురిలో 81.48 శాతం, అత్యల్పంగా సెంట్రల్ చెన్నైలో 53.91 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 66 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. కాగా, శుక్రవారం రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలతో పాటు పుదుచ్చేరిలోని ఒక స్థానంతో కలుపుకుని దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో 102 స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, రాష్ట్రంలోని ఎంపీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 950 మంది అభ్యర్థులు పోటీ చేయగా, వారి భవిత్యాన్ని తేల్చేలా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా సాయంత్రం 6 గంటల్లోపు క్యూ లో ఉన్న ఓటర్లందరికీ రాత్రి 9 గంటల వరకు ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. ఆరు గంటల తర్వాత వచ్చిన వారిని మాత్రం అనుమతించలేదు. ఇదిలావుంటే, రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఓ ప్రకటనలో వెల్లడించి, చివరగా 69.46 శాతం పోలింగ్ నమోదైనట్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ప్రకటించిన పోలింగ్ శాతం కంటే మూడు శాతం తక్కువగా నమోదైనట్టు పేర్కొంది. కాగా, జిల్లాల వారీగా నమోదైన పోలింగ్ శాతం వివరాలిలా వున్నాయి..

నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం

ఉత్తర చెన్నై: 60.13, దక్షిణ చెన్నై: 54.27, సెంట్రల్ చెన్నై : 53.91, ఆరణి : 75.65, పెరంబలూరు :78.61, సేలం: 78.13, చిదంబరం: 75.32, విల్లుపురం: 76.47, ఈరోడ్ : 70.54, అరక్కోణం: 70.54, తిరువణ్ణామలై : 73.88, విరుదునగర్ : 70.17, దిండిగల్ : 70.99, కృష్ణగిరి: 71.31, వేలూరు: 73.42, పొల్లాచ్చి: 70.70, నాగపట్టణం : 71.55, తేని: 69.87, నీలగిరి:70.93, కడలూరు: 72.28, తంజావూరు: 68.18, మైలాడుదురై : 70.06, శివగంగై: 63.94, తెన్‌కాశి: 67.55, రామనాథపురం: 68.18, కన్నియాకుమారి:65.46, తిరుపూరు: 70.58, తిరుచ్చి : 67.45, తూత్తుకుడి: 59.96, కోయంబత్తూరు: 64.81, కాంచీపురం: 71.55, తిరువళ్ళూవర్: 68.31, తిరునెల్వేలి: 64.10, మదురై: 61.92, శ్రీపెరంబుదూరు: 60.21, కళ్ళకుర్చి: 79.25, ధర్మపురి:81.48.

స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరుస్తున్న దృశ్యం



ఎండ తీవ్రత కారణంగానే నగరంలో తక్కువ పోలింగ్

చెన్నై జిల్లాలోని మూడు లోక్‌సభ స్థానాల పరిధిలో ఓటింగ్ శాతం ఎండ తీవ్రత కారణంగా తగ్గిందని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ రాధాకృష్ణన్ తెలిపారు. శుక్రవారం జరిగిన పోలింగ్‌లో నార్త్ చెన్నైలో 60.13 శాతం, దక్షిణ చెన్నైలో 54.27 శాతం, సెంట్రల్ చెన్నైలో 53.91 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. దీనిపై కమిషనర్ రాధాకృష్ణన్ స్పందించారు. నగర వాసుల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఆసక్తి తగ్గడంతో పాటు ఎండ తీవ్రత కారణంగా పోలింగ్ తగ్గిందన్నారు. నగరంలో భారీగా పోలింగ్ నమోదయ్యేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నగరంలో 48.60 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోగా, మూడు లోక్‌సభ స్థానాల పరిధిలో 56.01 శాతం పోలింగ్ నమోదైందన్నారు. వివిధ కారణాలతో జాబితా నుంచి ఓటర్ల పేర్లను తొలగించడం జరుగుతుందన్నారు. మరికొన్ని సందర్భాల్లో దోషపూరితంగా డిలీట్ అవుతుందన్నారు. కేవలం ఓటర్ గుర్తింపు కార్డు ఉంటేనే ఓటు వేయొచ్చనే భావనను ఓటర్లు విడనాడి, ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలని ఆయన సూచించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా బృహదీశ్వరుడి మహారథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తంజావూరు బృహదీశ్వరాలయ మహారథోత్సవం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఆ ఆలయంలో ప్రతియేటా చిత్తిరై ఉత్సవాలను 18 రోజులపాటు జరపటం ఆనవాయితీ. ఆ మేరకు ఈ యేడాది చిత్తిరై ఉత్సవాలు ఈ నెల 6న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం శనివారం ఉదయం ప్రారంభమైంది. అంతకు ముందు వేకువజాము 5.30 గంటలకు బృహదీశ్వరాలయం నుంచి త్యాగరాజస్వామి, కమలాంబాళ్, వినాయకస్వామి, నీలోద్భాలాంబాళ్, వళ్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వర్లు ముత్యాలతో అలంకరించిన సప్పరాల్లో బయలుదేరి రథ మండపంలో వేంచేశారు. తరువాత మహారథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై త్యాగరాజస్వామి, కమలాంబాళ్‌ను వేంచేపు చేసి వేదపండితులు పూజలు నిర్వహించారు. ఉదయం ఏడుగంటలకు రథోత్సవం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ దీపక్ జేకబ్, ఎస్పీ ఆశీశ్రావంత్, కమిషనర్ మహేశ్వరి, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బాబాజీ రాజాభోంస్లే తదితర ప్రముఖులు మోకుతాళ్లను లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం రథానికి ముందు వినాయకస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర్లు సప్పరాల్లో ఊరేగింపుగా వెళ్లారు. రథం వెనుక నీలోద్భాలాంబాళ్, చండికేశ్వర్లు సప్పరాల్లో ఊరేగారు. మంగళవాయిద్యాలు, వేలాదిమంది భక్తుల నడుమ రథాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపు పొడవునా భక్తులు 'ఆరూరా... త్యాగేశా' అంటూ భక్తి పారవశ్యంతో నినాదాలు చేశారు. రథం ముందు ఓదువార్లు తిరుమురైగళ్ కీర్తనలను గానం చేశారు. గ్రామీణ కళాకారులు కోలాటం, ఒయిల్ ఆట్టమ్, మయిలాట్టమ్ ఇలా పలు రకాల నృత్యాలు చేశారు. నాలుగు రాజ వీధుల్లోనూ రథం ఊరేగింది. ప్రధాన వీధుల్లో 14 చోట్ల రథాన్ని నిలిపి ప్రత్యేక దీపారాధనలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ రథోత్సవం కొనసాగింది. చివరగా రథాన్ని రథ మండప ప్రాంతానికి చేర్చారు. స్థానిక భక్త మండళ్ల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు మజ్జిగ, పానకాలను పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు కూడా జరిగాయి. ఈ వేడుకలలో హిందూ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కవిత, సదయ ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు డి. సెల్వం తదితర ప్రముఖులు పాల్గొన్నారు. సుమారు వెయ్యిమంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



కమలాంబాళ్ సమేత త్యాగరాజస్వామి

మూడు చోట్ల అంతరాయం...

ఈ మహారథం ఊరేగింపు సందర్భంగా మూడు చోట్ల ప్రకటన బోర్డు, విద్యుత్ స్తంభాలకు రథం పైభాగంలో వస్త్రస్తూపాలు తగులుకుని ఊరేగింపునకు అంతరాయం ఏర్పడింది. రథం బయలుదేరిన కాసేపటికి రహదారికి పక్కనే ఉన్న ఓ సంస్థ ప్రకటన బోర్డు రథంపై వస్త్రాలంకరణ భాగం తగులుకుంది. కార్మికులు ప్రకటన బోర్డులో చిక్కుకున్న వస్త్రాలను చినిగిపోకుండా తొలగించారు. దీని కారణంగా పావుగంటసేపు ఆ ప్రాంతంలోనే రథం నిలిచిపోయింది. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరిన రథం కొంగనేశ్వరాలయం సమీపంలో వెళుతుండగా విద్యుత్ స్తంభం తీగెల మధ్య రథంపైభాగన ఉన్న స్తూపాకార వస్త్రాలు చిక్కుకున్నాయి. వెంటనే విద్యుత్ బోర్డు కార్మికులు స్తంభం ఎక్కి రథం వస్త్రాలను తొలగించారు. దీంతో పావుగంట తర్వాత రథం బయలుదేరింది. మరో యాభై అడుగులు దూరంలో మళ్ళీ రథం పైభాగపు వస్త్రాలు మరో విద్యుత్ స్తంభంలో చిక్కుకున్నాయి. విద్యుత్ బోర్డు కార్మికులు ఆ వస్త్రాన్ని తొలగించారు. ఆ తరావ్త రథం సాఫీగా బయలుదేరింది.



స్ట్రాంగ్ రూంకు సీలు వేస్తున్న అధికారులు



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న చెన్నై పోలీసు కమిషనర్ సందీప్ రాథోడ్

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నాలుగంచెల భద్రత

- 24 గంటలపాటు సీసీ కెమెరాలతో నిఘా

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో దానికి సంబంధించిన ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరాయి. ఆ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నాలుగంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం ఆరుగంటలకు పోలింగ్ ముగియడంతో పోలింగ్ కేంద్రాల ఇన్‌ఛార్జి అధికారులు, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు, వీవీపాట్‌లకు సీలువేసి పోలీసు భద్రత నడుమ వాటిని లారీల్లో కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లలో వాటిని భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు శనివారం వేకువజాము వరకూ కొనసాగగా, పలు చోట్ల ఉదయం తొమ్మిది గంటల వరకు ఈవీఎంలను ఎన్నికల అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో పేర్చి కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో గదులకు తాళాలు వేసి, సీల్ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల ప్రధాన ప్రవేశద్వారానికి సాయుధ పోలీసుల కాపలా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ షిఫ్ట్ పద్ధతిలో పోలీసులు, పారా మిలటరీ దళాలు గస్తీ తిరుగుతున్నారు. ఈ స్ట్రాంగ్ రూములకు నలువైపులా వందల సంఖ్యలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు ఆయన సహాయకులు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వీలవుతుంది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీసులు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రమంతటా 39 కౌంటింగ్ కేంద్రాల వద్ద సుమారు 10 వేల మంది పోలీసులు, పారామిలిటరీ దళాలతో పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరుగనుంది. అప్పటివరకూ స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ పోలీసుల భద్రతా వలయం కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

నగరంలో 540 కెమెరాలతో నిఘా...

నగరంలోని సౌత్‌చెన్నై, నార్త్‌చెన్నై, సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద 540 సీసీ కెమెరాలతో నిఘా పెట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జె.రాధాకృష్ణన్ తెలిపారు. సౌత్ చెన్నై నియోజకవర్గంలో పోలైన ఓట్లను అన్నా విశ్వవిద్యాలయంలోను, సెంట్రల్ చెన్నై నియోజకవర్గం ఓట్లను లయోలా కాలేజీలోనూ, ఉత్తరచెన్నై నియోజకవర్గం ఓట్లను రాణీ మేరీ కళాశాలలోను జూన్ నాలుగున లెక్కించనున్నారు. ప్రస్తుతం ఈ మూడు ప్రాంతాల్లో స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు, వీవీ పాట్‌లను భద్రపరిచారు. కాగా చెన్నై పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ శనివారం నగరంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు.

స్ట్రాంగ్‌రూంలకు రెండు తాళాలు...

రాష్ట్రమంతటా ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూంలకు రెండు తాళాలు వేసి అధికారులు సీలుపెట్టారు. ఆ గదులలోని కిటికీలన్నింటినీ లోపలి వైపు మూసి ఉంచారు. ఈవీఎంలు భద్రపరిచిన ప్రాంతంలోని స్ట్రాంగ్ రూంలను మూడు విభాగాలుగా అధికారులు విభజించారు. ఓట్లు నమోదైన ఈవీఎంలు ఉంచిన ప్రాంతాన్ని పోలీసుస్ట్రాంగ్ రూమ్ అని, పోలింగ్ కేంద్రాల్లో ఉపయోగించి, చెడిపోయిన ఈవీఎంలు ఉంచిన ప్రాంతాన్ని 'రిపేర్ స్ట్రాంగ్ రూమ్' అని, పోలింగ్‌కు ఉపయోగించని ఈవీఎంలు ఉంచిన ప్రాంతాన్ని 'రిజర్వ్ స్ట్రాంగ్ రూమ్' అని విభజించి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

క్రోంపేట కళాశాలకు కాంచీపురం ఈవీఎంలు

కాంచీపురం లోక్‌సభ నియోజకవర్గంలో వినియోగించిన ఈవీఎంలను క్రోంపేటలోని కళాశాలకు తరలించారు. ఈ నియోజకవర్గం పరిధిలో చెంగల్పట్టు జిల్లాలోని చెంగల్పట్టు, తిరుపోరూర్, సెయ్యూరు, మధురాంతకం తదితర శాసనసభ నియోజకవర్గాలున్నాయి. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను క్రోంపేటలోని ఎంఐటీ కళాశాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

నేడు మదురైకి కళ్ళలగర్ పయనం

- 23న వైగై నదిలో ఆగమనోత్సవం

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అళగర్‌మలైలోని కళ్ళలగర్ ఆదివారం సాయంత్రం మదురై నగరానికి పయనమవుతున్నారు. ఆ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శైవ, వైష్ణవ మతాల సామరస్యానికి ప్రతీకగా ఈ ఉత్సవాలు ఈ నెల 28 వరకు జరుగనున్నాయి. శుక్రవారం సాయంత్రం తోళుక్కిలియాన్ పల్లకీలో ప్రత్యేక అలంకరణతో సుందరరాజ పెరుమాళ్ వేంచేశారు. ఆదివారం కొండప్పనాయకర్ మండపం నుంచి స్వామి సుందరరాజ పెరుమాళ్ కళ్ళలగర్ అలంకారంతో మదురై నగరానికి బయలుదేరుతారు. ఈ నెల 22న మూండ్రుమావడిలో ఎదురుసేవ జరుగుతుంది. ఆ రోజు రాత్రి తల్లాకుళం ప్రసన్న వెంకటాచలపతి ఆలయంలో స్వామివారు బసచేయనున్నారు. 23వ తేదీ వేకువజాము 5.51 గంటలకు కళ్ళలగర్ వైగై నదిలో స్వర్ణ అశ్వవాహనారూఢుడై వేంచేయనున్నారు. వైగై నదీ ఆగమన ఉత్సవంలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. వైగై నదీలో వేంచిన తర్వాత కళ్ళలగర్ స్వక్షేత్రం వైపు బయలుదేరి వెళతారు. మార్గమధ్యంలో పలు మండప ఘాట్‌లలో, ఆలయాల్లో బసచేసి భక్తులను అనుగ్రహించనున్నారు. 23 రాత్రి వండియూరు వీరరాఘవ పెరుమాళ్ ఆలయం లో బస చేస్తారు. 24న వండియూరు వైగై నదిలోని తేనూరు మండపంలో మండూక మహర్షికి శాపవిమోచనమిచ్చి, మోక్షం ప్రసాదించే ఘట్టం జరుగుతుంది. రాత్రి రామరాయర్ మండపంలో దశావతార వైభవాలను నిర్వహిస్తారు. 25న పూలపల్లకీలో స్వామివారు వేంచేస్తారు. 26న కళ్ళలగర్ మదురై నుంచి అళగర్‌స్వామి బయలుదేరి 27న అళగర్ మలై చేరుకుంటారు. ఈ నెల 28న ఉత్సవ శాత్తుముఱైతో వేడుకలు ముగియనున్నాయి.



తోళుక్కియాన్ పల్లకీలో కొలువుదీరిన కళ్ళలగర్‌స్వామి

సమాచార దృష్ణి

ఐఐటీలో కొత్త పీజీ కోర్సులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: జర్మన్ విశ్వవిద్యాలయంతో కలసి నీటి భద్రత, అంతర్జాతీయ మార్కెటింగ్‌కు సంబంధించి పీజీ కోర్సులు నిర్వహించనున్నట్లు చెన్నై ఐఐటీ తెలిపింది. జర్మన్‌లోని ఆసెన్, ట్రెస్డన్ అనే రెండు విశ్వవిద్యాలయాలు, ఐఐటీ సంయుక్తంగా అందించనున్న ఈ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని ఐఐటీ డైరెక్టర్ కామకోటి తెలిపారు. అడ్మిషన్ నిబంధనలు, పరీక్షా విధానాలతో పాటు ఇతర సమాచారాలకు ge.iitm.ac.in /I2MP/#popular progra-ms అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

వెస్సెల్ నావిగేటర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: కేంద్ర మత్స్య సాంకేతిక శిక్షణా కేంద్రం నిర్వహించే వెస్సెల్ నావిగేటర్, మెరైన్ ఫిట్టర్ కోర్సుల్లో చేరేందుకు జూన్ 14వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులకు నెలకు రూ.1,500 ఉపకార వేతనంతో పాటు బస, భోజన సౌకర్యం కల్పించనున్నారు. టెన్త్ మ్యాథ్స్ సైన్స్‌లో 40 శాతం మార్కులు పొంది 15 నుంచి 20 ఏళ్లలోపున్న విద్యార్థులు www.cifnet.gov.in అనే వెబ్‌సైట్‌లో జూన్ 14వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

గుర్తింపు లేని 196 టైప్ రైటింగ్ కేంద్రాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: అనుమతి తీసుకోకుండా 196 టైప్ రైటింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని సాంకేతిక విద్య డైరెక్టరేట్ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 1,000కి పైగా టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ శిక్షణా కేంద్రాలున్నాయి. ఈ సంస్థలో ప్రతి ఏటా రాష్ట్ర ఉన్నత విద్య శాఖ సాంకేతిక విద్య డైరెక్టరేట్ గుర్తింపు కోసం రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. కానీ, 196 సంస్థలు 2022 నుంచి రెన్యూవల్ చేసుకోకుండా ఉన్నాయని డైరెక్టరేట్ తెలిపింది. ఆ వివరాల జాబితా https://dte.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ప్రభుత్వ వర్సిటీలకు యూజీసీ కొత్త రాయితీలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్ పాఠ్యాంశాల్లో దూరవిద్య కోర్సులు నిర్వహించేందుకు ఏఐసీటీఈ అనుమతివాల్సిన అవసరం లేదని యూజీసీ తెలిపింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో దూరవిద్య, ఆన్‌లైన్ కోర్సుల్లో ఒక్కో పాఠ్య విభాగాలకు అడ్మిషన్లు ప్రారంభించక ముందే అంగీకార సంస్థల నుంచి అనుమతి పొందాలని ఇదివరకే యూజీసీ నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో, ఆ నిబంధనలు సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు వర్సిటీల్లో సాంకేతిక నిర్వహణ కోర్సులకు అనుమతి పొందాల్సిన అవసరం లేదంటూ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

2 నుంచి గుజరాత్‌కు ప్రత్యేక రైలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: వేసవి సెలవులను పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీ నియంత్రించేలా మే 2వ తేది నుంచి జూన్ 30వ తేది వరకు వారాంతపు ప్రత్యేక రైలు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి తిరుచ్చికి మే 2 నుంచి జూన్ 27వ తేది వరకు (గురువారం) వారాంతపు ప్రత్యేక రైలు నడుపనున్నారు. అలాగే, తిరుచ్చి నుంచి అహ్మదాబాద్‌కు మే 5 నుంచి జూన్ 30వ తేది వరకు (ఆదివారం) వారాంతపు ప్రత్యేక రైలు నడుపనున్నారు. గుజరాత్ రాష్ట్రం ఓఖా నుంచి మదురైకు మే 6 నుంచి జూన్ 24 వరకు (సోమవారం) వారాంతపు ప్రత్యేక రైలు, మదురై నుంచి ఓఖాకు మే 10 నుంచి జూన్ 28వ తేది వరకు (శుక్రవారం) వారాంతపు ప్రత్యేక రైలు నడుపనున్నారు.

మద్రాసు వర్సిటీ సెమిస్టర్ హాల్‌టిక్కెట్లు విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 20: మద్రాసు విశ్వవిద్యాలయ సెమిస్టర్ పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదలయ్యాయి. ఈ వర్సిటీ పరిధిలోని దూరవిద్యలో యూజీ, పీజీ, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు ఈ నెల 27వ తేది నుంచి సెమిస్టర్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు కేటాయించి, హాల్ టిక్కెట్లను www.ideunom.ac.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

పాంబన్‌లో తీర పరిశోధన కేంద్రం

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: పాంబన్‌లో తీర పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చెన్నైలో జాతీయ తీర పరిశోధన కేంద్రమైన ఎన్ఐఓటీ ఉంది. విశాఖపట్టణం సహా వివిధ ప్రాంతా ల్లో దీని శాఖలున్నాయి. ఈ నేపథ్యంలో, రామనాథపురం జిల్లా రామేశ్వరం తాలూకా పాంబన్ గ్రామంలో తీర పరిశోధన కేంద్రాన్ని త్వరలో ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

420 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: రెండు థర్మల్ స్టేషన్లలో 420 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. ఉత్తర చెన్నై థర్మల్‌విద్యుత్ కేంద్రంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది.శుక్రవారం అర్ధరాత్రి మూడవ యూనిట్లో బాయిలర్‌ట్యూబ్ పంక్చర్ కారణంగా ఉత్పత్తి నిలిచిపోయింది. ఇదే సమస్యతో సేలం జిల్లా మేట్టూరు విద్యుత్ కేంద్రలో 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండవ యూనిట్లో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది.

ఇంటర్న్‌షిప్ శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 20:ఇంజనీరింగ్ విద్యార్థులకు వేసవిలో ఇంటర్న్‌షిప్ శిక్షణను అన్నా విశ్వవిద్యాలయం పరిచయం చేసింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ సహా సాంకేతిక కళాశాలలో చదివే విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం స్కిల్ ఇండియా అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. అలాగే, రాష్ట్రప్రభుత్వం నాన్ ముదల్‌వన్ పథకం పరిచయం చేసింది. ఈ నేపథ్యంలో, అన్నా విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులకు సమ్మర్ ఇంటర్న్‌షిప్ శిక్షణ నాలుగు వారాలు జరుగనుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫీజు చెల్లించి పాల్గొనాలని వర్సిటీ ప్రకటించింది.

నేడు మదురై మీనాక్షి కల్యాణోత్సవం


మీనాక్షి, సుందరేశ్వరులు

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి, సుందరేశ్వరుల తిరుకల్యాణోత్సవం ఆదివారం జరుగనుంది. ఆ ఆలయంలో ప్రతియేటా చిత్తిరై ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ యేడాది చిత్తిరై ఉత్సవాలు ఈ నెల 12న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. పదిరోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లు వివిధ వాహనాలపై మాసి వీధులలో ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. రాయలవారి కిరీటం ధరించి సర్వాలంకరణ శోభితురాలై కొలువుదీరిన మీనాక్షి అమ్మవారికి ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్‌పర్సన్ రుక్మిణీ పళనివేల్‌రాజన్ సెంగోల్ సమర్పించి పట్టాభిషేక మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత స్వామి, అమ్మవారు రజత సింహవాసంలో ఊరేగారు. శనివారం ఉదయం ధారువర్ణ సప్పరంలో స్వామి, అమ్మవారు వేంచేశారు. రాత్రి అమ్మవారి దిగ్విజయాన్ని చాటేలా వేడుకలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారు నాలుగు మాసి వీధుల్లో వేంచేసి సంగ్రామంలో దిక్పాలకులపై విజయం సాధించే ఘట్టాన్ని ప్రదర్శించారు. ఈ వేడుకల్లో అత్యంత కీలక ఘట్టమైన మీనాక్షి సుందరేశ్వరుల తిరుకల్యాణోత్సవం ఆదివారం జరుగనుంది. ఆ వేడుకలకు ఆలయంలోని తిరుకల్యాణ మండపాన్ని ఆలయ నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. రూ.30లక్షతో వివిధ రకాల పుష్పాలతో కల్యాణ వేదికను అలంకరించనున్నారు. ఈ తిరుకల్యాణోత్సవంలో పాల్గొనేందుకు రిజర్వేషన్ చేసుకున్న భక్తులు కూర్చునే ప్రాంతంలో ఏసీ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఆదివారం ఉదయం తిరుకల్యాణోత్సవంలో పాల్గొనేందుకు తిరుప్పరంకుండ్రమ్ క్షేత్రం నుంచి సుబ్రహ్మణ్యస్వామివారు, పవళకనివాయ్ పెరుమాళ్ బయలుదేరి మీనాక్షి అమ్మవారి ఆలయానికి వేంచేయనున్నారు. వేకువజాము నాలుగు గంటలకు ఆలయ మండర మెట్లపై వేంచేసి చిత్తిరై వీధుల్లో స్వామి, అమ్మవారు ఊరేగనున్నారు. ఆ తర్వాత ముత్తురామయ్యర్ మండపంలో కన్యక ఊయలూగే ఘట్టాన్ని ప్రదర్శింపజేస్తారు. ఆ తర్వాత తిరుకణ్యాణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మొదట కళ్యాణవేదికపై మురుగపెరుమాన్, పవళకనివాయ్ పెరుమాళ్ వేంచేస్తారు. ఆ తర్వాత మీనాక్షి, సుందరేశ్వరర్ సర్వాలంకరణ శోభితులై భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 8.35 గంటల నుంచి మీనాక్షి తిరుకల్యాణోత్సవం జరుగుతుంది. ఈ కల్యాణోత్సవాన్ని ఆలయంలో తిలకించేందుకు 12 వేల మంది ఆన్‌లైన్‌లో టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకున్నారు. ఆ టికెట్లు కలిగిన వారిని ఆలయ నాలుగు రాజగోపుర ప్రవేశద్వారాల గుండా లోపలకు అనుమతిస్తారు. ఇక ఈ వేడుకలను ఆలయ ప్రాంగణం నలువైపులా అమర్చిన ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు మదురై సేతుపతి మహోన్నత పాఠశాలలో పెళ్ళి విందు కూడా ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు ఆ ప్రాంతం వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆదివారం రాత్రి గజవాహనంలో, ఆనంద రాయర్ పూల పల్లకీలో స్వామి, అమ్మవార్లు ఊరేగనున్నారు. సోమవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు.

జనావాసాల్లోకి మొసలి


పట్టుబడిన మొసలి

పెరంబూర్, ఏప్రిల్ 20: తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని గ్రామంలోకి ప్రవేశించిన మొసలిని అటవీ శాఖ అధికారులు బంధించారు. కడంబకుడి కళత్తుమేడు వీధికి చెందిన కాశిరాజన్‌కు చెందిన తోటలోకి శనివారం ఉదయం వెళ్లి న కొందరు అక్కడ ఉన్న మొసలిని గమనించారు. వెంటనే చోళపురం పోలీసులు, అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడకు చేరుకొని 4 అడుగుల మొసలిని బంధించి ఆనైకరై కొల్లిడం నదిలో వదిలిపెట్టారు.

24 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, ఏప్రిల్ 20: జూనియర్ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పోస్టులకు సంబంధించిన డైరెక్ట్ సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 24 నుంచి జరుగుతుందని టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జూనియర్ ఫార్మాస్యూటికల్ ఎగ్జామినర్ పోస్టుల భర్తీకి గత ఏడాది డిసెంబరు 5వ తేది రాత పరీక్ష నిర్వహించి ఫిబ్రవరి 2వ తేది ఫలితాలను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఉత్తీర్ణులైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగనుంది. అభ్యర్థుల సెల్‌ఫోన్, ఈ-మెయిల్‌కు కాల్ లెటర్లు పంపించామని, హాజరుకాని అభ్యర్థులకు మరో అవకాశం కల్పించమని టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి ఎస్.గోపాల్ సుందర్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

‘అర్పణ’ పేషెంట్ కేర్ సెంటర్ ప్రారంభం


సెంటర్ ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఏప్రిల్ 20: ఆర్ఎండీ ట్రస్ట్ ఆధ్వర్యంలో టి.నగర్‌లోని రాఘవయ్య రోడ్డులో క్యాన్సర్ తొలి దశ బాధితులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ‘పేషంట్ కేర్ సెంటర్’ ప్రారంభమైంది. సుభాష్‌చంద్ర రాంకా, ప్రవీణ్ చంద్, ముఖేష్ పటేల్ తదితర దాతల సౌజన్యంతో ఏర్పాటైన ఈ సెంటర్‌ను ఆర్ఎండీ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.రెపుబిక శ్రీధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్వయిజరీ బోర్డు సభ్యులు గోవింద ముంద్ర, నీలా దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

కొడైకెనాల్‌లో పెరిగిన పర్యాటకుల రద్దీ


కొడైకెనాల్‌లో శనివారం పర్యాటకుల సందడి

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్ర జ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో శనివారం పర్యాటకుల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రతియేటా వేసవిలో కొడైకెనాల్‌కు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావటంతో పర్యాటకుల సందడి క్రమంగా పెరుగుతూ వస్తోంది. గత రెండు వారాలుగా లోక్‌సభ ఎన్నికల కారణంగా పర్యాటకుల సందడి కాస్త తగ్గింది. ప్రస్తుతం కొడైకెనల్‌లోని అన్ని ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ అధికమైంది. నాలుగు రోజులకు ముందే పర్యాటకులు కొడైకెనల్‌లోని హోటల్ రూములు, రెస్టారెంట్లను బుక్ చేసుకున్నారు. దీంతో శనివారం అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో పర్యాటకుల సందడి అధికంగా కనిపించింది. ఎన్నికలు ముగియడంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు కూడా విశ్రాంతి తీసుకోవడానికి తరలి వచ్చారు. పగటిపూట చిరుజల్లులు పడుతుండటంతో అన్ని చోట్లా చల్లటి వాతావరణం నెలకొంది. దీంతో ఉద్యానవనాలు, సరస్సులు, లోయల వద్ద పర్యాటకు సంచారం అధికమైంది. వారం రోజులకు ముందు సవారీ లభించక దిగులు చెందిన టాక్సీ, ఆటో డ్రైవర్లు ప్రస్తుతం పర్యాటకులు పోటెత్తడంతో సంతోషిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్‌సైడ్ ఫుడ్‌షాప్‌లు తదితర ప్రాంతాల్లోనూ పర్యాటకుల సంచారం పెరిగింది. మరో రెండు రోజులలో పర్యాటకుల రాక మరింత పెరుగుతుందని టూరిస్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

మద్యంషాపులకు పోటెత్తిన మందుబాబులు

● మూడు రోజుల తర్వాత తెరుచుకున్న దుకాణాలు



చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల సెలవుల తర్వాత శనివారం తెరుచుకున్న టాస్మాక్ మద్యం దుకాణాలకు మందుబాబులు పోటెత్తారు. ఆదివారం మహావీర్ జయంతి సందర్భంగా మళ్ళీ మద్యం దుకాణాలు మూతపడనుండటంతో మద్యం కొనుగోలుకు దుకాణాల వద్ద వందల సంఖ్యలో జనం గుమికూడారు. ఆదివారం కోసం రెట్టింపుగా మద్యం సీసాలు కొనుగోలు చేశారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా ఈ నెల 17,18,19 తేదీలు మద్యం దుకాణాలు మూసివేశారు. శనివారం మధ్యాహ్నం పలుచోట్ల మద్యం దుకాణాలు తెరవక ముందే మందుబాబులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. దుకాణాలు తెరిచినవెంటనే ఒకరికొకరు పోటీపడుతూ బ్రాందీ, విస్కీ, బీరు కొనుగోలు చేశారు. అదే సమయంలో మూడు రోజులు మద్యానికి దూరమైనవారంతా శనివారం మద్యం దుకాణాల వద్దే తాగారు. మత్తు కాస్త తగ్గాక ఆదివారం కోసం మరికొన్ని మద్యం సీసాలు కొని ఇళ్ళకు బయలుదేరారు. రాష్ట్రమంతటా మద్యం దుకాణాల వద్ద ఈ దృశ్యాలే కనిపించాయి. శనివారం మద్యం విక్రయాలు అధికంగా ఉంటాయని ముందుగానే గ్రహించిన టాస్మాక్ అధికారులు శుక్రవారం రాత్రే దుకాణాలకు రెట్టింపు స్టాకు మద్యం సరఫరా చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మూడు రోజుల సెలవుల ప్రభావంతో మంగళవారం ఒకే రోజు రాష్ట్రమంతటా రూ.400 కోట్ల మేరకు మద్యాన్ని విక్రయించిన విషయం తెలిసిందే. ఆ రీతిలోనే శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అంతే మొత్తంలో మద్యం విక్రయాలు జరిగే అవకాశం ఉందని టాస్మాక్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మద్యం దుకాణాలన్నీ మందుబాబులతోనే కిటకిటలాడాయి.

వైభవంగా గరుడ సేవ

వేలూరు, ఏప్రిల్ 20: రాణిపేట జిల్లా 108 దివ్యదేశాల్లో ఒకటిగా పేరుగాంచిన షోలింగర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ చిత్ర బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరవ రోజైన శనివారం బంగారు గరుడ సేవ సందర్భంగా భక్త దేశీయ పెరుమాళ్‌ను ప్రత్యేక అలంకరించి, మహా దీపారాధన చేశారు. అనంతరం స్వామివారిని బంగారు గరుడ వాహనంపై వేంచేపు చేసి సన్నిధి వీధి సహా 8 మాడవీధుల్లో ఊరేగించారు.

నకిలీ వైద్యుడి అరెస్ట్

ఐసిఎఫ్, ఏప్రిల్ 20: ప్లస్ టూ చదివి చికిత్స చేస్తున్న నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మదురై ఒత్తకడై ప్రాంతంలో వైద్య కోర్సు చదవకుండా ప్రజలకు మందులిస్తున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. వారు తనిఖీలు నిర్వహించగా, అక్కడున్న ఓ క్లినిక్‌లో నరసింగం ఆర్టీ నగర్‌కు చెందిన అభిజిత్‌బిస్వాస్ (40) వైద్యం చేస్తున్నట్లు రుజువైంది. వారిచ్చిన సమాచారం మేరకు పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. విచారణలో... ప్లస్ టూ చదివిన అభిజిత్ పదేళ్లుగా ఆ ప్రాంతంలో అలోపతి వైద్య చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

పుళల్ ఫ్లై ఓవర్ నుంచి కింద పడి యువకుడి మృతి

● మరొకరికి గాయాలు

పెరంబూర్, ఏప్రిల్ 20: స్థానిక పుళల్ ఫ్లై ఓవర్ పై నుంచి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానిక మరమలైనగర్‌కు చెందిన హేమంత్ (29) స్నేహితుడు గుహన్‌రాజ్ (26)లు శనివారం ఉదయం వ్యాసర్పాడిలోని గుహన్‌రాజ్ బంధువు ఇంటికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంలో బయల్దేరారు. తాంబరం-మధురవాయల్ బైపాస్ రోడ్డు మీదుగా పుళల్ ఫ్లై ఓవర్ మీదకు చేరుకున్న ద్విచక్రవాహనం హఠాత్తుగా అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని 50 అడుగుల కిందఉన్న సర్వీస్ రోడ్డుపై పడింది.ఈఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అక్కడకు చేరుకున్న వైద్య సిబ్బంది వారిని పరీక్షించి, అప్పటికే హేమంత్ మృతిచెందినట్లు గుర్తించి, తీవ్ర గాయాలతో ఉన్న గుహన్‌రాజ్‌ను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మాధవరం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటేందుకు యత్నం

● బైక్ ఢీకొని అస్సాం యువతి మృతి

వేళచ్చేరి, ఏప్రిల్ 20: సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటేందుకు యత్నించిన యువతి బైక్ ఢీకొని మృతిచెందింది. అస్సాం రాష్ట్రానికి చెందిన పలానిఅంకాంకుచ్చిపాణి (24) అమింజికరైలోని అద్దింట్లో ఉంటూ అన్నానగర్ ప్రాంతంలోని బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తుంది. ఈ నెల 17వ తేది రాత్రి డ్యూటీ నుంచి వెళ్తున్న ఆమెను బైక్ ఢీకొంది. సమాచారం అందుకున్న అన్నానగర్ ట్రాఫిక్ పోలీసులు ఆమెను కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక శుక్రవారం రాత్రి మృతిచెందింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆ యువతి సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటే యత్నంలో ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు.

సుడిగుండంలో చిక్కుకొని ఇద్దరి మృతి


లోకేశ్వరన్, సుందరమూర్తి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఏప్రిల్ 20: వైగై డ్యాం వెనుక చెక్‌డ్యాంలో స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు సుడిగుండంలో చిక్కుకొని మృతిచెందారు. తేని జిల్లా రామలింగపురం గ్రామానికి చెందిన లోకేశ్వరన్, సుందరమూర్తి వేర్వేరు ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్నారు. శుక్రవారం సెలవు కావడంతో, ఇద్దరు స్నేహితులతో కలసి వైగై డ్యాం వెనుక ఉన్న చెక్‌డ్యాం వద్దకు స్నానాలకు వెళ్లారు. వారు స్నానం చేస్తున్న సమయంలో హఠాత్తుగా వచ్చిన సుడిగుండంలో చిక్కుకొని లోకేశ్వరన్, సుందరమూర్తి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని గాలించి ఇరువురు మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రోన్‌తో ఫొటోలు తీసిన వ్యక్తి అరెస్టు

అడయార్, ఏప్రిల్ 20: ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన తంజావూరు బృహదీశ్వర ఆలయాన్ని డ్రోన్ ద్వారా ఫొటోలు తీసిన వ్యక్తిని తంజావూరు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలోనే కాకుండా, ప్రపంచంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయాన్ని జాతీయ పురావస్తు శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ క్రమంలో ఆలయ దక్షిణ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి డ్రోన్ ఎగురవేసి ఫొటోలు తీశారు. దీనిపై ఆలయ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... డ్రోన్ ద్వారా ఫొటోలు తీసిన వ్యక్తిని అరుణ్ ప్రసాద్ (26)గా గుర్తించి అరెస్టు చేశారు.

రెండో ఓటు వేసేందుకు ప్రయత్నించిన ఓటరు అరెస్టు

అడయార్, ఏప్రిల్ 20: కోయంబత్తూరులో రెండోసారి ఓటు వేసేందుకు ప్రయత్నించిన ఓటరును భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో శుక్రవారం జరిగిన పోలింగ్‌లో తిరునావుక్కరసు (52) అనే వ్యక్తి మొదట ఓటు వేశారు. కొన్ని గంటల తర్వాత మరోమారు ఓటు వేసేందుకు ప్రయత్నించగా, పోలింగ్ బూత్ ఆఫీసర్ లతా మహేశ్వరి గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విమానాశ్రయంలో 5,000 తాబేళ్ల పిల్లలు స్వాధీనం

వేళచ్చేరి, ఏప్రిల్ 20: మలేసియా నుంచి చెన్నైకు విమానంలో తరలిస్తున్న 5,000 అరుదైన తాబేలు పిల్లలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ విమాన ప్రయాణికులను అధికారులు తనిఖీ చేస్తున్న సమయంలో, తనిఖీలకు భయపడిన ఓ వ్యక్తి, తన వద్ద ఉన్న రెండు సూట్‌కేస్‌లను కన్వేయర్ బెల్ట్ వేసి పరారయ్యాడు. పరిశీలించిన అధికారులు తాబేలు పిల్లలను గుర్తించి తిరిగి వాటిని మలేసియాకు పంపేలా చర్యలు చేపట్టారు.

బహిష్కరించిన ప్రాంతాల్లో రీ పోలింగ్...?

● ఈసీ పరిశీలన

పెరంబూర్, ఏప్రిల్ 20: రాష్ట్రంలో శుక్రవారం జరిగిన లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించిన గ్రామాలు, ప్రాంతాల్లో రీ పోలింగ్ జరిపే అంశంపై ఎన్నికల సంఘం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకే విడతలో జరిగిన ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరగ్గా, మరికొన్ని నియోజకవర్గాల్లో తక్కువగా నమోదైంది. అదే సమయంలో కొన్ని గ్రామాలు, ప్రాంతాల్లో ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. పుదుకోట జిల్లా వేంగైవాయల్‌లో తాగునీటిలో మానవ వ్యర్థాలు కలిపిన వ్యవహారంపై విచారణ పూర్తిచేసి, నిందితులను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో లోక్‌సభ ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు గ్రామస్థులు ప్రకటించారు. గ్రామస్థులతో అధికారులు జరిపిన చర్చలు ఫలించినా తక్కువ సంఖ్యలోనే ఓట్లు పోలయ్యాయి. అలాగే, పరందూర్‌లో విమానాశ్రయ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఏకనాపురం గ్రామస్థులు ఎన్నికలు బహిష్కరించగా, అధికారులు జరిపిన చర్చలతో మొత్తం 1,375 ఓట్లలో 21 మాత్రమే పోలయ్యాయి. అలాగే, రాణిపేట, తిరువణ్ణామలై, కృష్ణగిరి సహా పలు జిల్లాల్లో 21 ప్రాంతాల్లో ప్రజలు పోలింగ్ బహిష్కరించారు. ఎన్నికల బహిష్కరణ ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనా, ఆయా ప్రాంతాల్లో మళ్లీ రీ పోలింగ్ నిర్వహించే అంశంపై ఎన్నికల అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ విషయమై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకొనే అవకాశముందని ఈసీ వర్గాల సమాచారం.

పరందూర్ విమానాశ్రయానికి వ్యతిరేకత

● ఏకనాపురంలో 21 మంది మాత్రమే ఓటు నమోదు

పెరంబూర్, ఏప్రిల్ 20: కాంచీపురం జిల్లా పరందూర్ పరిసర ప్రాంతాల్లో చెన్నై రెండో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. విమానాశ్రయం ఏర్పాటుకు 14 గ్రామాల పరిధిలోని నివాస ప్రాంతాలు, వ్యవసాయ భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏకనాపురం, పరిసర గ్రామాల ప్రజలు పలురకాల ఆందోళన, నిరసనకార్యక్రమాలు చేపడుతున్నారు.నిరసనకార్యక్రమంలో భాగంగా లోక్‌సభ ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ఏకనాపురం గ్రామస్థులు నిర్ణయించారు. ఈ గ్రామంలో 1,375 మంది ఓటర్లు ఉండగా, వారి కోసం ఆ ప్రాంతంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో, శుక్రవారం జరిగిన పోలింగ్‌లో కేవలం 21 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోగా, మిగిలిన వారు బహిష్కరించారు.

నటుడు విజయ్‌పై ఫిర్యాదు

పెరంబూర్, ఏప్రిల్ 20: ఓటు వేసేందుకు పెద్దసంఖ్యలో మద్దతుదారులతో వచ్చారంటూ నటుడు విజయ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ నియోజకవర్గాలకు శుక్రవారం పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. నటుడు విజయ్ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు స్థానిక నీలాంగరైలోని పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఆ సమయంలో సుమారు 200 మంది మద్దతుదారులతో విజయ్ రావడంతో, గట్టి బందోబస్తు నడుమ పోలీసులు పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో, నగరానికి చెందిన ఓ సామాజిక వేత్త నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో విజయ్‌పై ఫిర్యాదు చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టేలా ఎన్నికల నిబంధనలు అతిక్రమించి 200 మంది కార్యకర్తలతో పోలింగ్ కేంద్రానికి వచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంల తరలింపు


స్ట్రాంగ్‌రూమ్‌కు సీలు వేస్తున్న దృశ్యం

వేలూరు, ఏప్రిల్ 20: వేలూరు లోక్‌సభ నియోజకవర్గం పోలింగ్ శుక్రవారం సాయంత్రం ముగియడంతో, ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ నియోజకవర్గ పరిధిలోని గుడియాత్తం, అంబూరు, వాణియంబాడి శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను తంథై పెరియార్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల జనరల్ సూపర్‌వైజర్ డా.రూపేష్‌కుమార్, ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి తదితరులు అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో పరిశీలించారు. ఈ స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటల సాయుధ దళాల బందోబస్తు ఏర్పాటుచేశామని, ఈ కేంద్రం పరిసరాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నట్లు ఎన్నికల అధికారి సుబ్బులక్ష్మి తెలిపారు.

సౌత్ చెన్నై 13వ పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్ జరపండి : తమిళిసై


ఎన్నికల రిటర్నింగ్ అధికారి అమిత్‌కు వినతి ప్రతం సమర్పిస్తున్న తమిళిసై

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సౌత్ చెన్నై నియోజకవర్గంలోని 122వ వార్డు 13 నెంబర్ పోలింగ్ కేంద్రంలో రీ పోలింగ్ జరపాలని ఆ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ డిమాండ్ చేశారు. ఆ మేరకు పార్టీ ప్రతినిధులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అమీత్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం పోలింగ్ జరుగుతుండగా మైలాపూరు శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఉన్న 122వ వార్డు ఆస్టిన్‌నగర్‌లోని 13వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 5.30 గంటల సమయంలో ప్రభు, అరుణ్ సహా 50 మంది చొరబడి బీజేపీ ఏజెంట్లు గోవింద్ సహా పలువురిపై దాడి చేసి తరిమికొట్టి బూత్ స్వాధీనం చేసుకుని నకిలీ ఓట్లు వేశారని ఆరోపించారు. 13, 15, 17 నెంబర్ పోలింగ్ కేంద్రాల్లోనూ ఆ దుండగులు ఉదయం నుంచే నకిలీ ఓట్లు వేసినట్లు తమిళిసై పేర్కొన్నారు. ఇక చోళింగనల్లూరు ప్రాంతంలో వందల సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించినట్లు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. టినగర్‌లోని 199, 200, 201, 202 వార్డులలోనూ వేల సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించారని ఆమె తెలిపారు.

విజయవంతంగా ముగిసిన నెక్ట్స్ జెన్ ప్రోస్థోడొంటిక్స్ సమ్మిట్


సదస్సులో ప్రముఖులు

అడయార్, ఏప్రిల్ 20: సవీత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సిమ్మాట్స్) సవీత డెంటల్ కాలేజీ ఆధ్వర్యంలో 26వ ఇండియన్ ప్రోస్థోడొంటిక్ సొసైటీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కన్వెన్షన్ విజయంతంగా ముగిసింది. తాజాగా సిమ్మాట్స్ ప్రాంగణంలో జరిగిన ఈ సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 2300 మంది డెలిగేట్స్ హాజరయ్యారు. ఇందులో ప్రధానంగా దంత మార్పిడి వైద్య నిపుణులు పాల్గొన్నారు. అలాగే, 30 మంది ముఖ్య అతిథులు కీలకోపన్యాసాలు చేశారు. వివిధ విభాగాలకు చెందిన దంత వైద్యులు, నిపుణులు, పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నట్లు సిమ్మాట్స్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

క్రిస్ గోపాలకృష్ణన్‌కు జీవిత సాఫల్య పురస్కారం


గోపాలకృష్ణన్‌కు పురస్కారం అందజేస్తున్న డాక్టర్ మోహన్ తదితరులు

అడయార్, ఏప్రిల్ 20: నగరానికి చెందిన డాక్టర్ మోహన్స్ డయాబెట్స్ స్పెషాలిటీ సెంటర్ (డీఎండీఎస్‌సీ), మద్రాస్ డయాబెటీస్ రీసెర్చ్ సెంటర్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్) సంయుక్తంగా ఇన్ఫోసిస్ కో-ఫౌండర్, ప్రతీక్ష ట్రస్ట్ ట్రస్టీ, పద్మభూషణ్ క్రిస్ గోపాలకృష్ణన్‌కు వైద్య రంగంలో సేవలకుగాను ప్రతిష్ఠాత్మక ‘డీఎండీఎస్‌సీ లైఫ్ అఛీవ్‌మెంట్ అవార్డు’ ప్రదానం చేశాయి. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ సురేంద్రన్, డీఎండీఎస్‌సీ, ఎండీఆర్ఎఫ్ డాక్టర్ వి.మోహన్, డీఎండీఎస్‌సీ వైస్ ఛైర్మన్ డాక్టర్ రంజిత్ ఉన్నికృష్ణన్, డీఎండీఎస్‌సీ మేనజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం.అంజనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడుతూ, ‘క్రిస్ గోపాలకృష్ణన్ తన మేథస్సునంతా పరిశోధనలకే అంకితం చేశారని, అలాంటి వ్యక్తికి ఈ పురస్కారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

హెచ్‌పీ నుండి 2 కొత్త రకం లాప్‌టాప్‌లు

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్లు, లాప్‌టాప్‌ల తయారీలో పేరుగడించిన హెచ్‌పీ సంస్థ గేమర్లు, కంటెంట్ సృష్టికర్తల కోసం కొత్తగా కృత్రిమ మేధోపరిజ్ఞానం (ఏఐ)తో కూడిన రెండు రకాల లాప్‌టాప్‌లను మార్కెట్లో ప్రవేశపెట్టిందపి హెచ్‌పీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఇప్సితా దాస్ గుప్తా తెలిపారు. ఈ కొత్త రకం లాప్‌టాప్‌లలో ఓమెన్ ట్రాన్సెండ్ 14, హెచ్‌పీ ఎన్వీ ఇంటూ 360, 14లు ఇంటెల్ కోర్ అల్ట్రా ప్రాసెసర్లు కలిగి ఉన్నాయని వివరించారు.

గిరిప్రదక్షిణ తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలో ఈ నెల 22న చిత్రాపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా సంస్థ అధికారులు తెలిపారు. చిత్రాపౌర్ణమిని పురస్కరించుకుని చెన్నై సహా పలు నగరాలు, పొరుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తిరువణ్ణామలైకి వెళ్ళనుండటంతో ఈ నెల 22, 23 తేదీలలో ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. ఈ నెల 22న కిలాంబాక్కం నుంచి 527 బస్సులు 23న 628 బస్సులు, మాధవరం బస్‌స్టేషన్ నుండి ఈ నెల 22న 30 బస్సులు, 23న మరో 30 బస్సులు నడుపనున్నట్లు తెలిపారు.

ఓటు ఒక చోట....
పోటీ మరో చోట

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు ఒక నియోజకవర్గంలో ఓటు, మరో నియోజకవర్గంలో పోటీచేశారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజవర్గాలకు శుక్రవారం ఎన్నికలు జరగ్గా, 950 మంది బరిలో నిలిచారు. ఈ క్రమంలో, పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒక ప్రాంతంలో ఓటు వేస్తే, మరో ప్రాంతంలో పోటీ చేసారు. దీంతో, సదరు అభ్యర్థులు ఉదయాన్నే తమ ఓటు హక్కు వినియోగించుకొని హుటాహుటిన పోటీచేసిన ప్రాంతానికి వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు. - పెరంబూర్



కనిమొళి | ఎ.రాజా | అన్నామలై | ఎల్.మురుగన్ | దురై వైగో | దినకరన్

- తూత్తుకుడిలో డీఎంకే డీఎంకే తరఫున పోటీచేసిన కనిమొళి, చెన్నై మైలాపూర్ ఆర్కే రోడ్డులోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కోయంబత్తూర్‌లో బీజేపీ తరఫున పోటీచేసిన అన్నామలై, కరూర్ నియోజకవర్గ పరిధిలోని ఊత్తుపటి పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.
- రామనాథపురం నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఇండిపెండెంట్‌గా పోటీచేసిన మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, తేని నియోజకవర్గం పెరియకుళంలో ఓటు వేశారు.
- తిరుచ్చి నియోజకవర్గంలో ఎండీఎంకే తరఫున పోటీ చేసిన దురై వైగో కళింగపట్నంలో ఓటు వేశారు.
- ధర్మపురి నియోజకవర్గంలో పీఎంకే తరఫున పోటీచేసిన సౌమ్య అన్బుమణి, దిండివనంలో ఓటు వేశారు.
- నీలగిరి నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీచేసిన మాజీ కేంద్ర మంత్రి ఎ.రాజా, పెరంబలూరు నియోజకవర్గంలో ఓటు వేశారు. అలాగే, ఇదే నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీచేసిన కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, చెన్నై కోయంబేడులో ఓటు వేశారు.
- తేని నియోజకవర్గంలో ఏఎంఎంకే తరఫున పోటీచేసిన టీటీవీ దినకరన్ చెన్నై అడయార్ కార్పొరేషన్ పాఠశాలలో ఓటు వేశారు.
- విరుదునగర్ నియోజకవర్గంలో డీఎండీకే తరఫున పోటీచేసిన విజయ ప్రభాకరన్, శాలిగ్రామంలో ఓటు వేశారు. అదే నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీ చేసిన రాధిక శరత్‌కుమార్, చెన్నై కొట్టివాక్కంలో ఓటు వేశారు.
- తిరునల్వేలి నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన రాబర్ట్ బ్రూస్, కన్నియాకుమారిలో ఓటు వేశారు.
- వేలూరు నియోజకవర్గంలో పోటీచేసిన మన్సూర్ అలిఖాన్ చెన్నై నుంగంబాక్కంలో ఓటు వేశారు.

పోలింగ్ అధికారిగా హిజ్రా



రాధ

పెరంబూర్, ఏప్రిల్ 20: చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ అసిస్టెంట్‌గా పనిచేసిన హిజ్రా రాధ, శుక్రవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రం అధికారిగా వ్యవహరించారు. ఈ విషయమై రాధ మాట్లాడుతూ... నాకు ఈ బాధ్యతలు అప్పగించడం హిజ్రా సముదాయానికి లభించిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. తాను శిక్షణకు వెళ్లిన సమయంలో, పలువురు నన్ను చూసి, నువ్వు ఎన్నికల అధికారివా? అంటూ ప్రశ్నించగా, తాను ఎన్నికల అధికారినే అని సమాధానమిచ్చానని రాధ తెలిపారు. ఈ విషయమై చెన్నై జిల్లా ఎన్నికల అధికారి డా.జి.రాధాకృష్ణన్ మాట్లాడుతూ... హిజ్రాలు సమాజంలో గౌరవప్రదంగా ఉండాలనే ఉద్దేశంతో ఆమెకు విధులు అప్పగించామని తెలిపారు.



రాష్ట్రంలో జరిగిన 18 లోక్‌సభ ఎన్నికల్లో
పోలైన ఓట్ల వివరాలు

పెరంబూర్, ఏప్రిల్ 20: దేశ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలిచిన రాష్ట్రం ఆది నుంచీ ఎన్నికల వ్యవహారంలో చైతన్యవంతమే. రాజకీయ నేతల్లోనూ, ప్రజల్లోనూ పోలింగ్‌పై అవగాహన వుంది. ఏ ఏడాదికా ఏడాది పోలింగ్ శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో గత 1951 నుంచి 2024 వరకు 18 సార్లు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం వివరాలిలా వున్నాయి...



సంవత్సరం	ఓట్ల శాతం
1951-52	59.33
1957	47.75
1962	68.77
1967	76.56
1971	71.82
1977	67.13
1980	66.76
1984	72.98
1989	66.86
1991	63.92
1996	66.93
1998	57.95
1999	57.98
2004	60.81
2009	72.94
2014	73.74
2019	71.87
2024	69.46

ఓటు వేయని మైలాడుదురై, తెన్‌కాశి అభ్యర్థులు



సుధ, కృష్ణస్వామి

పెరంబూర్, ఏప్రిల్ 20: లోకసభ ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు ఓటు హక్కు వినియోగించుకోలేదు. మైలాడుదురై నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆర్.సుధ స్వగ్రామం తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి. శుక్రవారం జరిగిన పోలింగ్ కోసం ఆమె గుమ్మిడిపూండి వెళ్లి ఓటు వేసి మళ్లీ మైలాడుదురై చేరుకొని పోలింగ్ సరళి పరిశీలించలేని పరిస్థితులుంటాయని భావించి ఆమె ఓటు వేయలేదని ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. అలాగే, కోయంబత్తూర్ కునియముత్తూర్‌లో నివసిస్తున్న పుదియ తమిళగం పార్టీ అధ్యక్షుడు డా.కృష్ణస్వామి, అన్నాడీఎంకే కూటమిలో తెన్‌కాశి నియోజకవర్గంలో పోటీచేస్తుండడంతో ఆయన శుక్రవారం ఓటు హక్కు వినియోగించుకోలేదు.

రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్లొచ్చు

- సత్య ప్రద సాహు వెల్లడి

అడయార్, ఏప్రిల్ 20: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్రం పరిధిలోనే రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్ళవచ్చని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహూ తెలిపారు. ఈ విషయంపై ఆయన శనివారం మాట్లాడుతూ, ఎన్నికల్ కోడ్ ఉన్న నేపథ్యంలో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్ళకుండా ఆంక్షలు ఉండేవన్నారు. కానీ పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఎలాంటి ఆధారాలు, పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్ళవచ్చన్నారు. ఈ వెసులుబాటు కేవలం తమిళనాడు పరిధిలోకే వర్తిస్తుందన్నారు. అదే సమయంలో ఓట్ల లెక్కింపు జరిగే జూన్ నాలుగో తేదీ వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. పోలింగ్ జరిగిన శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, సాయంత్రం వేళలో పోలింగ్ శాతం ఒక్కసారిగా పెరిగిందన్నారు.

ద్రావిడ పార్టీలదే హవా!

- అన్ని సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ పార్టీలకే ఓటింగ్‌శాతం అధికం

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాట 1960వ దశకం నుంచి ద్రావిడ పార్టీలదే హవా కొనసాగుతోంది. డీఎంకే, దాని నుంచి ఆవిర్భవించిన అన్నాడీఎంకే వంతులవారీగా పాలన సాగిస్తున్నాయి. దేశంలో ఒక ప్రాంతీయ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమనేది తమిళనాడులోనే ప్రారంభమైంది. 1967లో సీఎన్ అన్నాదురై నేతృత్వంలోని డీఎంకే పార్టీ కాంగ్రెస్‌పై ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అది మొదలు తమిళనాట డీఎంకే, ఆ పార్టీ నుంచి విడివడి దివంగత నటుడు ఎంజీఆర్ స్థాపించిన అన్నాడీఎంకే పార్టీలే అత్యధికశాతం ఓట్లు పొందుతున్నాయి. ఆ తరువాత కాలంలో అనేక పార్టీలు వచ్చినా, ఎన్నికల్లో ఈ రెండు ద్రావిడ పార్టీలు, లేదా ఆ పార్టీల నేతృత్వంలోని కూటములే 90 శాతానికి పైగా ఓట్లు సొంతం చేసుకుంటున్నాయంటే అతిశయోక్తి కాదు. 1967 నుంచి 2019 వరకు జరిగిన 12 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే విధానం కొనసాగడం విశేషం. 1984లో అయితే ఈ రెండు కూటములే 96.91 శాతం ఓట్లు దక్కించుకున్నాయి. 2019 వరకు ఆ రెండు పార్టీలు పొందుతున్న ఓట్ల శాతంలో మార్పురాలేదు.

1977- 1991 కాలంలో...

1977 నుంచి ఇప్పటివరకు ఎప్పుడూ డీఎంకే ఒంటరిగా పోటీచేయకపోవడం గమనార్హం. భావసారూప్యత కలిగిన పార్టీలతో జతగూడే ఎన్నికలను ఎదుర్కొంటోంది. 1977 నుంచి 1991 వరకు జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఇరు పార్టీ కూటములు పొందిన ఓట్ల శాతం 90 శాతానికి పైగా ఉంది. ఈకాలంలో 1980లో జరిగిన ఎన్నికలు మినహా మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ అన్నాడీఎంకే-కాంగ్రెస్ కలిసి పోటీచేశాయి. ఆ ఎన్నికల్లో జనతా పార్టీ, సీపీఐ, సీపీఎం పార్టీలు అన్నాడీఎంకే కూటమిలోనూ, డీఎంకే-కాంగ్రెస్ మరో కూటమిగానూ పోటీచేశాయి. మిగిలిన అన్ని ఎన్నికల్లో కాంగ్రెసేతర కూటమిని డీఎంకే ఏర్పాటుచేసింది. 1977లో మాత్రం అన్నాడీఎంకే-కాంగ్రెస్ కూటమిలో చేరిన సీపీఐ, తర్వాత అన్ని ఎన్నికల్లో డీఎంకే కూటమిలోనే ఉంది.



డీఎంకే చిహ్నం - అన్నాడీఎంకే చిహ్నం

కొత్త పార్టీలు...

1989 ఎన్నికల్లో పీఎంకే బరిలోకి దిగడంతో, డీఎంకే, అన్నాడీఎంకే కూటమి పార్టీలు పొందుతున్న ఓట్ల శాతం స్వల్పంగా తగ్గడం ప్రారంభమైంది. అలాగే, 1996లో జయలలిత వ్యతిరేక పవనాలు అధికంగా ఉన్న నేపథ్యంలో, రెండు పార్టీల కూటములు సాధించిన మొత్తం ఓట్ల శాతం 81 శాతానికి తగ్గింది. అందుకు కారణం ఎండీఎంకే నేతృత్వంలో ఒక కూటమి, పీఎంకే, బీజేపీ మరో కూటమిగా పోటీచేయడమే. ఈ కూటములు ఆ ఎన్నికల్లో 15 శాతం ఓట్లు సాధించాయి. అనంతరం 1998 లోక్‌సభ ఎన్నికల్లో రెండు ద్రావిడ పార్టీలు పొందిన మొత్తం ఓట్ల శాతంలో పెరుగుదల కనిపించింది. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి 30 స్థానాలు సాధించింది. కానీ, తదుపరి 1999లో ఎన్నికల్లో ఈ రెండు ద్రావిడ పార్టీల ఓటు శాతం తగ్గింది. అందుకు కారణం 1996, 1998 ఎన్నికల్లో డీఎంకేతో కలిసి వున్న తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్) పార్టీ 1999లో కూటమి నుంచి విడిపోయి ప్రత్యేక కూటమి ఏర్పాటుచేసుకొని 9.4 శాతం ఓట్లు సాధించింది.

విజయకాంత్ పార్టీ రాకతో కాస్త మార్పు!

దివంగత నటుడు విజయకాంత్ నేతృత్వంలో ఏర్పాటైన ద్రావిడ ముర్పోకు ద్రావిడ కళగం (డీఎండీకే) 2009 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి 10 శాతం ఓట్లు పొందింది. దీంతో డీఎంకే, అన్నాడీఎంకేల ఓట్ల శాతంలో కాస్త తగ్గుదల కనిపించింది. ఆ తర్వాత కూడా డీఎంకే, అన్నాడీఎంకే కూటముల పొందుతున్న ఓట్ల శాతం తగ్గింది. 2014లో జరిగిన ఎన్నికల్లో 39 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసిన అన్నాడీఎంకే.. ఏకంగా 37 స్థానాలు సాధించింది. బీజేపీ, పీఎంకే, డీఎండీకే, ఎండీఎంకే పార్టీలతో ఏర్పాటైన మూడవ కూటమి 19 శాతం ఓట్లు సాధించింది. ఐదేళ్ల క్రితం 2019లో జరిగిన ఎన్నికల్లో రెండు ద్రవిడ పార్టీలు ఇతర బలమైన పార్టీలతో కూటములు ఏర్పాటుచేసినా, ఈ రెండు కూటములకు 84 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. ఆ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే), మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం, నామ్ తమిళర్ పార్టీలు మొత్తం 12.85 శాతం ఓట్లు సాధించాయి. ప్రస్తుత ఎన్నికల్లోనూ పీఎంకే, టీఎంసీ, ఏఎంఎంకే, కొన్ని పార్టీలు బీజేపీతో కలసి కొత్త కూటమి ఏర్పాటు చేసుకున్నాయి. డీఎండీకేతో పాటు కొన్ని చిన్నాచితకా పార్టీలు అన్నాడీఎంకే పంచన చేరగా, డీఎంకే కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు, కమల్ నేతృత్వంలోని మక్కల్‌నీది మయ్యం వంటి పార్టీలు నిలిచాయి. సినీ దర్శకుడు సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ పార్టీ ఎప్పటిలాగే ఒంటరిగా పోటీచేస్తోంది. అయితే ఈ పార్టీ ఓటర్లపై ఏమాత్రం ప్రభావం చూపకపోవచ్చు. తమిళనాట త్రిముఖ పోటీ నెలకొన్న ఈ పరిస్థితుల్లో ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంతశాతం ఓట్లు వస్తాయన్నది చర్చనీయాంశమైంది.

ఏ సంవత్సరంలో ఏ కూటమికి ఎంతశాతం ఓటింగ్ వచ్చిందంటే?!..

సంవత్సరం	డీఎంకే ఓట్ల శాతం	అన్నాడీఎంకే ఓట్ల శాతంరెండు పార్టీల కూటముల ఓటింగ్ శాతం, పొందిన సీట్లు (బ్రాకెట్లో)
1977 18.61	30.03	డీఎంకే+ 37.84 (3)- అన్నాడీఎంకే+ 56.91 (36)
1980 23.01	25.38	డీఎంకే+ 54.63 (37)- అన్నాడీఎంకే+40.14 (2)
1984 25.90	18.36	డీఎంకే+ 37.04 (2)- అన్నాడీఎంకే+ 59.87 (37)
1989 26.66	17.12	డీఎంకే+ 33.78 (1)- అన్నాడీఎంకే+ 56.98 (38)
1991 22.69	18.10	డీఎంకే+30.12 (0)- అన్నాడీఎంకే+ 60.67 (39)
1996 25.63	7.84	డీఎంకే+ 54.96 (39)- అన్నాడీఎంకే+ 26.1 (0)
1998 20.08	25.89	డీఎంకే+ 42.72 (8)- అన్నాడీఎంకే+ 47.48 (30)
1999 23.13	25.68	డీఎంకే+ 45.89 (26)- అన్నాడీఎంకే+ 41.69 (13)
2004 24.60	29.77	డీఎంకే+ 57.4 (39)- అన్నాడీఎంకే+ 34.84 (0)
2009 25.09	22.88	డీఎంకే+ 42.53 (27)- అన్నాడీఎంకే+ 37.3 (12)
2014 23.57	44.27	డీఎంకే+ 26.8 (0)- అన్నాడీఎంకే+ 44.27 (37)
2019 33.53	19.40	డీఎంకే+ 53.21 (38)- అన్నాడీఎంకే+ 30.55 (1)

ఓటు హక్కును వినియోగించుకోని 1.90 కోట్ల మంది

అడయార్, ఏప్రిల్ 20: రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం జరిగిన పోలింగ్‌లో 1.90 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేదనే సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో 6,23,33,925 మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులని, కానీ, శుక్రవారం నమోదైన పోలింగ్ శాతం 69.46 శాతం ఉందన్నారు. అంటే 4,32,97,144 మంది ఉన్నారని తెలిపారు. 30 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదన్నారు. మొత్తం 1,90,36,781 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారన్నారు. అలాగే, నార్త్ చెన్నైలో 5,96,545 మంది ఓటింగ్‌లో పాల్గొనలేదు. దక్షిణ చెన్నైలో 9,25,178 మంది ఓటు వేయలేదని తెలిపారు. సెంట్రల్ చెన్నైలో 7,27,871 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్టు సమాచారం. ఈ మూడు జిల్లాల్లో వరుసగా 60.13, 54.27, 53.91 శాతం చొప్పున పోలింగ్ శాతం నమోదైంది.



'ఒరు నొడి' చిత్ర బృందం

తమన్ కుమార్ హీరోగా 'ఒరు నొడి'

చిత్రజ్యోతి

ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు ధనుంజయన్ తన నిర్మాణ సంస్థ ధనుంజయన్ క్రియేటివ్ పతాకం సమర్పణలో తమన్ కుమార్‌ను హీరోగా పరిచయం చేస్తూ నిర్మించిన చిత్రం 'ఒరు నొడి'. ఈ నెల 26వ తేదీన విడుదల చేస్తున్నారు. పి.మణివర్మన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తమన్ కుమార్, ఎంఎస్ భాస్కర్, వేల.రామమూర్తి, పళ కరుప్పయ్య, శ్రీరంజిని, గజరాజ్ తదితరులు నటించగా, సంజయ్ మాణిక్యం సంగీత స్వరాలు సమకూర్చారు. థ్రిల్లర్ జానర్‌లో రూపొందించిన ఈ చిత్రాన్ని మదురై అళగర్ మూవీస్ వైట్ లాంప్ పిక్చర్స్ బ్యానర్లపై అళగర్ జి, కేజీ రతీష్ సంయుక్తంగా నిర్మించారు. క్రియేటివ్ ఎంటర్‌టైన్మెంట్ తమిళనాడు వ్యాప్తంగా పంపిణీ చేయనుంది. ఈ సినిమా ఆడియో, ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. నటుడు ఆరి అర్జునన్, నిర్మాత సీవీ కుమార్, సాహితీవేత్త పళ.కరుప్పయ్య, రచయిత వేల.రామమూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు మణివర్మన్ మాట్లాడుతూ, 'సాధారణంగా సినిమా అవకాశాల కోసం అన్వేషించే సమయంలో ఇతరులు అదోలా చూస్తారు. కానీ, నిర్మాత అళగర్ నాపై ఎంతో నమ్మకంతో ఈ ప్రాజెక్టు అప్పగించారు. కేరళలోని ఒక దర్శకుడి కోసం ఈ స్టోరీ సిద్ధం చేశాను. ఆ తర్వాత కెమెరామెన్ రతీష్‌కు వినిపించిన తర్వాత ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. ఈ సినిమా చూసిన సెన్సార్ సభ్యులు తాము ఇప్పటివరకు చూసిన థ్రిల్లర్ మూవీల్లో ఎంతో వైవిధ్యభరితంగా ఉందంటూ అభినందించారన్నారు. హీరో తమన్ కుమార్ మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరూ మరో వ్యక్తికి ఏదో రూపంలో సాయం చేస్తూనే ఉంటారు. మనకు కూడా సాయం చేసినవారుంటారు. ఈ విషయం చివరి నిమిషం వరకు తెలియదు. అనేక మలుపులతో కూడిన స్ర్కీన్‌ప్లేతో, ప్రేక్షకులను ఉత్కంఠతకు లోనుచేసేలా ఇది కొనసాగుతుంది' అని పేర్కొన్నారు. అలాగే, నిర్మాతలతో పాటు చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు.

హీరోతో పాటు మహిళ పాత్ర కీలకంగా ఉంటుంది : విశాల్




కొరియోగ్రాఫర్‌తో కలిసి స్టెప్స్ వేస్తున్న దేవీశ్రీ ప్రసాద్, విశాల్

దర్శకుడు హరి తెరకెక్కించే చిత్రాల్లో హీరోతో పాటు ఒక మహిళ పాత్ర కీలకంగా ఉంటుందని హీరో విశాల్ అన్నారు. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'రత్నం'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. హరి దర్శకుడు. దేవీశ్రీ ప్రసాద్ సంగీత దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదలకానున్న సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నగరంలో నిర్వహించారు. హీరో విశాల్ మాట్లాడుతూ, 'మార్క్ ఆంటోనీ' చిత్రం నాకు కొత్త ద్వారాలు తెరిచింది. రూ.100 కోట్ల కలెక్షన్ క్లబ్ చేరడంతో గౌరవమర్యాదలు దక్కాయి. దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్‌కు కూడా ఒక లైఫ్ ఇచ్చింది. దర్శకుడు హరితో ఇది నా మూడో చిత్రం. సరిగ్గా ఎనిమిదేళ్ళ తర్వాత ఇద్దరం కలిసి పనిచేస్తున్నాం. ఈ స్టోరీలో ఓ సర్‌ప్రైజ్ ఉంది. హరి రూపొందించే చిత్రాలన్నింటిలో హీరోతో పాటు ఒక మహిళకు కీలక పాత్ర ఉంటుంది. చిన్న చిత్రాలకు కూడా ఆదరించాలి. కొత్త నటీనటులతో పాటు కొత్త నిర్మాతలు కూడా బాగుండాలి' అని కోరారు. దర్శకుడు హరి మాట్లాడుతూ, 'ఇది నా 17వ చిత్రం. విశాల్‌లో మూడో చిత్రం. ఇప్పటి ఆడియన్స్‌కు బాగా నచ్చుతుంది. 60 శాతం యాక్షన్, 40 శాతం కమర్షియల్. విశాల్ యాక్షన్ కింగ్. కానీ, ఇందులో ఎమోషనల్ కూడా అద్భుతంగా చేశారు. దేవీశ్రీ ప్రసాద్ మంచి సంగీతం ఇచ్చారు. 'డోంట్ వర్రీ మచ్చీ' సాంగ్ బారా రీచ్ అయింది. 3.5 కిమీ వరకు సెట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ సీన్‌ను ఒకే టేక్‌లో పూర్తి చేశాం. ఒక రోజంతా రిహార్సల్ చేసి, మరుసటి రోజున షూటింగ్ చేశాం. ఆడియన్స్‌కు గౌరవం ఇచ్చి సినిమా తీశాం. సినిమా చూసే సమయంలో ఈ విషయం మీకు తెలుస్తుంది' అన్నారు. నిర్మాత ధనుజయన్ మాట్లాడుతూ, 'మార్క్ ఆంటోనీ' రూ.వంద కోట్లు వసూలు చేసింది. 'రత్నం' రూ.300 కోట్లు వసూలు చేస్తుంది. మంచి మార్కెట్ ఉన్న యాక్షన్ హీరో. రాజకీయాల వైపు రావొద్దు. సినిమాలపైనే దృష్టిసారించండి' అని కోరారు.

ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'బిహైండ్'

అమన్ రఫీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'బిహైండ్'. ఎమోషనల్ సెస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది. ఒక తల్లి ప్రేమ పోరాటాన్ని తెలిపే హర్రర్ మూవీగా రూపొందించారు. షిజా జిను అందించిన కథతో తన సొంత నిర్మాణ సంస్థ భవకుట్టి క్రియేషన్స్ పతాకంపై నిర్మించారు. కథను దర్శకుడు వివరిస్తూ, 'తన బిడ్డకు అంతీంద్రియ శక్తులు ఆవహించినట్టుగా ఒక తల్లి గ్రహిస్తుంది. ఆ బిడ్డను కాపాడుకునేందుకు ఆమె పోరాడుతుంది. కానీ, ఆమె భర్త మాత్రం ఆమె వాదనలను కొట్టిపడేస్తారు. అయినప్పటికీ తన బిడ్డను రక్షించుకునేందుకు ఆమె దుష్టశక్తికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. ఈ క్రమంలో ఆమె తన బిడ్డను రక్షించుకుందా? పొంచివున్న ఆ ప్రమాదం ఏమిటి? దానికి కారణం ఎవరు వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పేలా ఈ కథ సాగుతుంది. సీనియర్ నటి సోనియా అగర్వాల్ తల్లి పాత్ర పోషించగా, కుమారుడిగా మినుమోల్, భర్తగా టామ్ నటించారు. త్రిశూర్, వాగమన్, కుట్టిక్కానం, మునార్, ఎలపర తదితర ప్రాంతాల్లో 40 రోజుల పాటు షూటింగ్ జరుపుకుంది. ఇందులో ఐదు పాటలున్నాయి. రెండు గంటల పాటు సాగే కథ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతుంది. త్వరలోనే ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.



'బిహైండ్'లో ఓ దృశ్యం



9 కార్ల రోజా

ఎంత ఎమ్మెల్యే అయితే మాత్రం అన్ని కార్లు అవసరమా ఆయమ్మకి? అనే మాటలు నగరి నియోజకవర్గంలో జోరుగా వినిపిస్తున్నాయి. నామినేషన్‌తో పాటూ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి ఆర్కే రోజా తనకు 9 కార్లున్నట్టు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఆమె 6 కార్లున్నట్టు చూపగా ఈసారి మరో మూడు కలిపారు. జగన్ నవరత్నాలకు దీటుగా నవకార్లు సొంతం చేసుకున్నారని జనం మాటల్లో వినిపిస్తోంది. ఈ నవకార్లలో కోటికి పైగా విలువ చేసే బెంజ్ కారు కూడా ఉండడం విశేషం. ఈ కారు కొన్నపుడు ఆమె మీద విమర్శలు కూడా వైరల్ అయ్యాయి. హోండా పల్సర్ బైక్ కూడా రోజా ఆస్తుల్లో చూపారు. 2019లో గెలిచాక ఆస్తులు కూడా బాగానే కొన్నారే మంత్రిగారు అనే మాటలూ సాగుతున్నాయి. నగరి మండలం కీలపట్టు, వీరకావేరిరాజపురం, విజయపురం మండలంలోని పాతార్కాడులో 6.39 ఎకరాల వ్యవసాయ భూమి, భర్త సెల్వమణి నగరిలో 0.94 ఎకరాల వ్యవసాయ భూమి వీరికి ఉంది. అలాగే తెలంగాణలోని గచ్చిబౌలి, పుత్తూరులో ఇంటి స్థలాలు, భర్త సెల్వమణి పేరిట నగరిలో మూడు ఇంటి స్థలాలు కొనుగోలు చేసినట్లు చూపించారు. జగన్ ప్రభుత్వం పోరాడుతున్న మార్గదర్శిలోనూ రోజాకు దాదాపు రూ.40లక్షల చిట్ ఉండడం కూడా జనం మాటల్లో దొర్లుతోంది.

- పుత్తూరు అర్బన్

కుయ్యో మొర్రో..

బాబ్బాబ్బాబ్బాబూ.. అంటూ అధికారపార్టీవారు ఆ నాయకుల వెంటపడుతున్నారు. చీకటి పడ్డాక వారి ఇళ్ల వద్దకు చేరుకుంటున్నారు. 'నిజమేనబ్బా.. మీకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేకపోయా.. తప్పయి పోయింది. ఈసారి గెలిస్తే మీకేం కావాలంటే అది చేసుకోవచ్చు. ఈ ఎన్నికల్లో సహకరించండి' అని గెడ్డాలు పట్టుకుని బతిమాలుతున్నారు. శ్రీకాళహస్తిలో అధికార వైసీపీ వారి ఈ అవస్థలు చూసి పలువురు నవ్వుకుంటున్నారు. రకరకాల కారణాలతో పట్టణంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వారినీ, తటస్థంగా ఉండే ప్రముఖులను కూడా ఇలాగే ప్రాధేయపడుతున్నారు. రాత్రి పది గంటల నుంచి ఈ బుజ్జగింపుల పర్వం మొదలవుతోంది. అర్ధరాత్రి దాటినా కొనసాగుతూ ఉంటుంది. ఈ అర్ధరాత్రి అవస్థలు చూసిన స్థానికులు ఉదయం టీ దుకాణాల దగ్గర వీటిని చర్చకు పెడుతున్నారు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఎట్టబ్బా.. పార్టీ మూడొంతులు ఖాళీ అయిపోయాక మేల్కొన్నారు గదా మనోళ్లు' అని ఆ పార్టీ వాళ్లే అనుకుంటున్నారు.

- శ్రీకాళహస్తి




జన చేతనం



నాయకుడికి దూరచూపు ఉండాలి. అభివృద్ధికి అర్ధం తెలియాలి. విజన్ కొరవడిన పాలన వర్తమానంలో కూరుకుపోతుంది. భవిష్యత్ తరాలకు ద్రోహం జరుగుతుంది. అభివృద్ధి అంటే ఓట్లలెక్కలు కాదు. అభివృద్ధి అంటే కరెంటు ఛార్జీలు పెంచి, పన్నులు పెంచి, ధరలు పెంచి, మద్యం ఏరుల్లా పారించి... ఎడాపెడా బాదేసి సంక్షేమం అంటూ నగదు విదిల్చడం కాదు. అభివృద్ధి అంటే చదువుల పందిరి వేయడం. అభివృద్ధి అంటే ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం. అభివృద్ధి అంటే ఉపాధికి బాటలు పరవడం.. మరి ఒక్క ఛాన్స్‌తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి చేసిందేమిటి? పాదయాత్రలో జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై చెప్పిన మాటలన్నీ ఆచరణలో అమలయ్యాయా? అంతకుముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏం చేశారు? జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఇద్దరు నేతల ముద్రలేమిటో చూద్దాం...

తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లా పారిశ్రామిక చిత్రపటం



విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు ఉన్న పేరు 2014-19 నడుమ నిజం అని రుజువైంది. విభజన తర్వాత రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన ఆయన జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక రంగాన్ని ఎంచుకున్నారు. ఫలితం.. ఆ ఐదేళ్లలో దేశ, విదేశీ, బహుళ జాతి కంపెనీలెన్నో జిల్లాలో కొలువు దీరాయి. రూ. వేల కోట్ల పెట్టుబడులు ప్రవహించాయి. 2014-19 నడుమ 50 వేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలూ వృద్ధి చెందాయి.

2014-19 చంద్రబాబు హయాంలో వెలుగులు





ఎలక్ట్రానిక్ హబ్

తిరుపతికి పుణ్యక్షేత్రంగానే కాకుండా ఎలక్ట్రానిక్ హబ్‌గా కూడా పేరు తేవాలని చంద్రబాబు ఉబలాటపడ్డారు. విమానాశ్రయానికి చేరువగా ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయించారు. ప్రఖ్యాతిగాంచిన పరిశ్రమలు వచ్చేలా చొరవ చూపారు. డిక్సన్, సెల్‌కాన్, టీసీఎల్, కార్బన్, టెల్ లింక్స్, సన్నీ ఆప్‌టెక్, ఫాక్స్‌లింక్, సెవెన్ హిల్స్ డిజిటల్ పార్క్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ యూనిట్లు వెలిశాయి. వాటన్నింటికీ ఆయనే శంకుస్థాపన.. ప్రారంభోత్సవాలు చేశారు. ఈఎంసీ-1లోనే 13,851 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. తర్వాత నెలకొల్పిన ఈఎంసీ-2 ఇదే రీతిలో అభివృద్ధి చేశారు. ఈ రెండు క్లస్టర్ల నిర్వహణ కోసమే విమానాశ్రయం వద్ద ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసి ఐఏఎస్ అధికారిని సీఈవోగా నియమించారు.

- ఏర్పేడు మండలం పాగాలి వద్ద రాక్‌మెన్ ప్లైవుడ్ పరిశ్రమ, ప్రకాష్ స్టీల్స్ ఫెర్రో కంపెనీలు, ఓస్వీన్ వుడ్ ప్యానెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.
- తొట్టంబేడు మండలంలో గ్రీన్ ప్యానెల్, కజారియా టైల్స్, అక్సారా పరిశ్రమలు వచ్చాయి.
- నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో ప్రైమ్ ఎలక్ట్రికల్స్, అరబిందో ఫార్మా, జెల్ క్యాప్స్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఒక జెల్ క్యాప్స్ కంపెనీ ద్వారానే సుమారు 10 వేల మందికి ఉపాధి దక్కుతోంది.
- తడ మండలం మాంబట్టులో ఇండజ్ కాఫీ, టాటా కెమికల్స్, మ్యాక్స్ కింగ్ పరిశ్రమలు, సూళ్లూరుపేటలో తారకేశ్వర టెక్స్‌టైల్స్ పార్క్ స్థాపితమయ్యాయి. ఈ మండలంలోనూ పది వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి.
- సత్యవేడు మండలంలో హీరో మోటార్స్, వరదయ్యపాలెం మండలంలో కాంటినెంటల్ కాఫీ, అపోలో టైర్స్ వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు వచ్చాయి. ఈ మూడింటిలోనే పది వేల మందికి ఉద్యోగాలు దొరికాయి. సత్యవేడు, శ్రీకాళహస్తి, నగరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల యువత ఈ పరిశ్రమలతో లబ్ధి పొందుతున్నారు.





2019 ఎన్నికల్లో గెలిచి జగన్‌రెడ్డి సీఎం అయ్యారు. అప్పటి దాకా పనులు మొదలు పెట్టని పరిశ్రమల యాజమాన్యాలన్నీ హడావిడిగా నిర్ణయాలు మార్చుకున్నాయి. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలను విరమించుకున్నాయి. కొత్త ప్రతిపాదనలూ లేవు. ఉన్నవి తప్పితే అదనంగా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. అనేక పరిశ్రమలు విస్తరణను విరమించుకున్నాయి. రిలయన్స్ జియో వెనక్కి వెళ్లింది. అమరరాజ పొరుగు రాష్ట్రాలకు పారిపోయింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం పాలనా తీరుకు కొలబద్దగా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి స్తంభించిపోయింది.

2019-24 జగన్ పాలనలో చీకట్లు

ప్రతిపక్ష నేతగా ఏం చెప్పారు?

2018 జనవరి 21న పాదయాత్రలో భాగంగా శ్రీకాళహస్తికి వచ్చారు. తాను అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తానని, ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరికేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సీఎంగా ఏం చేశారు?

2019 జూన్‌లో అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ ఒక్కటంటే పరిశ్రమ కూడా శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో ఏర్పాటు చేయలేదు. జిల్లాలో ఎక్కడా కొత్తగా ఒక్క పరిశ్రమా రాలేదు.

'అపాచీ' ఎక్కడ?

శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు వద్ద అపాచీ సంస్థ ద్వారా రూ.700 కోట్లతో భారీ పాదరక్షల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు జగన్ ప్రభుత్వం హడావిడి చేసింది. 2022 జూన్ 23న సీఎం జగన్ ఇలగనూరుకు వచ్చి శంకుస్థాపన కూడా చేశారు. ఈ పరిశ్రమతో 10 వేల మందికి ఉపాధి లభిస్తుందని, అందులో 80 శాతం మంది మహిళలే ఉంటారని జగన్ ప్రకటించారు. 2023 సెప్టెంబరుకల్లా పనులు పూర్తవుతాయని, ఈ ప్రాంతానికి కొత్త ఉషోదయం ప్రారంభమవుతుందని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ పనులే మొదలు కాలేదు. భూమి పూజ జరిగిన చోట శంకుస్థాపన శిలాఫలకం ఆనవాళ్లు కూడా లేకుండా మాయం చేశారు. అక్కడి బీడు భూములు జగన్ శంకుస్థాపన తంతును వెక్కిరిస్తున్నాయి.



ఈ బూట్లే ఇక్కడ తయారయ్యేదంటూ శంకుస్థాపన రోజున సీఎం జగన్‌కు చూపుతున్న యాజమాన్య ప్రతినిధులు



అపాచీ శిలాఫలకం చివరికి ఇలా మిగిలింది

చంద్రబాబు రప్పించిన వాటికే ప్రారంభోత్సవాలు


రేణిగుంట విమానాశ్రయానికి వెనుకవైపున ఉన్న ఎలక్ట్రానిక్స్ మ్యాన్యుఫాక్చరింగ్ క్లస్టర్-1లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసిన టీసీఎల్ పరిశ్రమను 2022 జూన్ 23న సీఎం జగన్ ప్రారంభించారు. అదే క్లస్టర్‌లోనే సన్నీ ఓపో టెక్ కంపెనీకి సంబంధించిన మొబైల్ ఫోన్లకు సంబంధించిన కెమెరా మాడ్యూల్స్ తయారీ యూనిట్.. ఫాక్స్ లింక్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఆ క్లస్టర్‌లోనే సెవెన్ హిల్స్ డిజిటల్ పార్క్ విస్తరణకు, క్లస్టర్ 2లోని డిక్సన్ టీవీ తయారీ యూనిట్‌కు శంకుస్థాపనలు చేశారు. ఇవన్నీ కూడా టీడీపీ ప్రభుత్వంలో జిల్లాకు వచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకున్నవి.. చంద్రబాబు భూమి పూజ చేసినవే కావడం గమనార్హం.

'రిలయన్స్ జియో' వెనుకంజ

తిరుపతి వద్ద రూ. 15 వేల కోట్లతో రిలయన్స్ జియో ఇండస్ట్రీ ఏర్పాటుకు 2018 ఫిబ్రవరిలో విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో నాటి సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని ఒప్పించారు. ఈ మేరకు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఫోన్లు, టీవీలు, సెట్‌టాప్ బాక్సులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తయారీ చేసే ఈ పరిశ్రమ ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. రేణిగుంట మండలంలో 150 ఎకరాలను అధికారులు సేకరించారు. పది లక్షల ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచశ్రేణి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు కావాల్సిన తరుణంలో ప్రభుత్వం మారింది. రిలయన్స్ జియో కోసం సేకరించిన 150 ఎకరాలకు పరిహారం సంతృప్తికరంగా లేదని 12 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. రైతులతో చర్చించి ఒప్పించేందుకు, సమస్యను పరిష్కరించేందుకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చొరవా తీసుకోలేదు. ప్రభుత్వ తీరుతో రిలయన్స్ విసిగిపోయింది. తాము పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకుంటున్నట్టు 2019 నవంబరులో ప్రకటించింది. తద్వారా పేరు ప్రఖ్యాతులు, యువతకు ఉపాధి పొందాల్సిన జిల్లా తీవ్రంగా నష్టపోయింది.

అమరరాజను వేధించి వెళ్లగొట్టారు

రేణిగుంట మండలం కరకంబాడి వద్ద 1985 డిసెంబరులో గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి దంపతులు స్థాపించిన అమరరాజా బ్యాటరీస్ దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సంస్థ. రూ. 11 వేల కోట్లకు పైగా వార్షిక టర్నోవర్‌తో నడుస్తున్న ఈ పరిశ్రమ జిల్లాలో 16 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చీ రావడంతోనే అమరరాజపై వేధింపులు మొదలయ్యాయి. యాదమరి మండలం నూనెగుండ్లపల్లె వద్ద కూడా అమరరాజా సంస్థ బ్యాటరీల తయారీ ప్రారంభించింది. ఈ రెండు చోట్లా నడుస్తున్న తొమ్మిది యూనిట్ల వల్ల కాలుష్యం ఏర్పడుతోందని కారణం చూపుతూ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జారీ చేసిన ఆదేశాలతో 2021 మే 1న ఎస్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో సంస్థకు రూ. 50 కోట్ల మేర నష్టం వాటిల్లింది. తర్వాత కూడా వేధింపులు కొనసాగడంతో విసిగివేసారిన అమరరాజా సంస్థ తదుపరి విస్తరణ యూనిట్లను ఇరుగుపొరుగు రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఆ మేరకు 2023 మేలో తెలంగాణలో రూ. 9500 కోట్ల పెట్టుబడితో లిథియం బ్యాటరీల తయారీ యూనిట్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ ప్లాంటు జిల్లాలో ఏర్పాటు కాకపోవడం వల్ల రూ. 9500 కోట్ల పెట్టుబడులు, 4500 ఉద్యోగాలను జిల్లా కోల్పోవాల్సి వచ్చింది. కొత్త పరిశ్రమలు జిల్లాకు తీసుకురాకపోగా వున్న వాటిని జిల్లా నుంచీ వెళ్లగొట్టేలా అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని జిల్లా ప్రజలు మండిపడ్డా కక్షల రాజకీయాల్లో తేలే నాయకులు తప్పు దిద్దుకోలేదు.



స్వర్ణముఖిపై 'బియ్యపు' గాలిమేడలు

చెవిలో పువ్వు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: భక్తులు పరమ పవిత్రంగా భావించే స్వర్ణముఖి నది అధ్వాన స్థితికి అద్దం పడుతున్న చిత్రమిది. అగస్త్య మహర్షి తపోశక్తితో ఉత్తర వాహినిగా స్వర్ణ వర్ణ కాంతులతో ఉద్భవించిన నదిని సువర్ణముఖిగా భక్తులు ఆరాధిస్తుంటారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి స్వర్ణముఖి నదిని ప్రస్తావించిన ప్రతిసారి అద్భుతాలు సృష్టిస్తాననడం అలవాటుగా మారిపోయింది. ఎమ్మెల్యేగా గెలిచాక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఇరిగేషన్ అధికారులతో తొలి సమావేశం నిర్వహించి స్వర్ణముఖికి మోక్షం వచ్చిందని ప్రకటన చేశారు. చరిత్రలో నిలిచిపోయేలా ఈ నదిని ప్రక్షాళన చేస్తున్నామన్నారు. నదిపై చెక్ డ్యాములు నిర్మిస్తామని.. ఏడాది పొడవునా జలకళ తీసుకొస్తామని చెప్పుకొచ్చారు. సుందరమైన స్నాన ఘట్టాలు, లైటింగ్, బోటింగ్, లేజర్ షోలు.. ఒక్కటేమిటి ప్రజలను ఊహల పల్లకిలో ఊరేగించారు. స్వర్ణముఖి కరకట్టలను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాకింగ్ ట్రాక్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తర్వాత ప్రైవేట్ ఎక్స్‌కవేటర్ల యజమానులను పిలిపించి మొక్కుబడిగా ఒకసారి పిచ్చి మొక్కలను తొలగించారు. తర్వాత కొద్ది నెలలకే మళ్లీ పాత వాతావరణం ఏర్పడింది. ముక్కంటి ఆలయం వద్ద పడమర వైపున స్వర్ణముఖి కరకట్టను నిర్మించారు. అది కూడా ఫ్లడ్ వాల్ తక్కువ ఎత్తులో. దానిపైన గ్రావెల్ ఎక్కువ ఎత్తులో అనాలోచితంగా నిర్మించారు. కొద్ది నెలలకే గ్రావెల్ కోతకు గురైంది. నదిలోకి జారడంతో కొత్త కట్ట అధ్వానంగా మారింది. స్వర్ణముఖి గతం కన్నా దయనీయంగా మారిపోయింది. గతంలో మురుగునీరు, వ్యర్థాలు కొంత కలిసేవి. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో ప్రైవేట్ లాడ్జిలు పెరిగిపోవడం, మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. లైటింగ్, బోటింగ్, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రమంటూ చెప్పిన మధుసూదనరెడ్డి మాటలన్నీ నీటిమూటలేనని ప్రజలు విమర్శిస్తున్నారు.





ఫ్యాను రెక్కలు ముక్కలు

సూళ్లూరుపేట వర్తమానం

తడ, ఏప్రిల్ 20: సూళ్లూరుపేట వైసీపీని అసమ్మతి పుట్టి ముంచేటట్టే ఉంది. మరోవైపు టీడీపీ జోరు పెంచుకుంటోంది. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన కిలివేటి సంజీవయ్య గెలుపొందారు. రెండోసారి గెలిచాక ఆయన వైఖరిలో వచ్చిన మార్పు పార్టీ శ్రేణులను నెమ్మది నెమ్మదిగా దూరం చేసింది. అనుకూల, ప్రతికూల వర్గాలుగా పార్టీ చీలిపోయింది. పార్టీ కార్యక్రమాల్లోనూ ఇదే ప్రస్ఫుటమవుతోంది. చాలామంది నాయకులు పైకి పార్టీ కోసమే పనిచేస్తున్నామని చెబుతున్నా లోన రగిలిపోతూనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయకులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయారు. ఏడాది క్రితం మాటల దాడితో సరిపెట్టుకున్న ఇరువర్గాలు ఆ తరువాత ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారు. ఈ నియోజకవర్గ పరిస్థితిపై అధిష్ఠానానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెండువర్గాల మధ్య సయోధ్య కోసం పార్టీ పెద్దలు చేసిన కృషి ఫలించలేదు. అదే సమయంలో మరోసారి కిలివేటికి టిక్కెట్ ఇస్తే ఓడిస్తామంటూ బహిరంగంగానే వ్యాఖ్యలు చేసినా అధిష్ఠానం పట్టించుకోలేదు. కిలివేటి టిక్కెట్ అయితే తెచ్చుకున్నారు గానీ అసమ్మతి నాయకులను మాత్రం దారిలోకి తెచ్చుకోలేకపోయారు. కొందరు పార్టీవీడి టీడీపీలో చేరిపోయారు. పెళ్లకూరు మండలంలో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో వాటాలపై ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డికీ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డికీ మధ్య జరిగిన వివాదం పార్టీ పరువును బజారున పడేసింది. ఇక ఏకంగా ప్రచారంలోనే పార్టీనేతలు బాహాబాహీలకు దిగుతున్నారు. ఈ గొడవలతో చెంగాళమ్మ ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్, అసమ్మతి నేత దువ్వూరు బాలచంద్రారెడ్డి అలిగి హైదరాబాదుకు వెళ్లిపోయారు. టీడీపీ మీద అలిగిన వేనాటి రామచంద్రారెడ్డిని వైసీపీలోకి తెచ్చుకున్నామన్న ఆనందం కూడా ఆ పార్టీకి మిగలడం లేదు. ఆయన అనుచరులెవ్వరూ టీడీపీని వీడి రాలేదు.

సైకిల్ జోరు

బలమైన ఓటు బ్యాంకు ఉన్నా గత రెండు ఎన్నికల్లో టీడీపీని గ్రూపు రాజకీయాలు దెబ్బతీశాయి. 2014లో టీడీపీ అభ్యర్థి పరసా వెంకటరత్నం 3,762 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2019లో కూడా పాత పరిస్థితే విజయాన్ని దూరం చేసింది. గడచిన ఐదేళ్లుగా పార్టీలో నాయకులు కలసి పనిచేయడం ప్రారంభించారు. విభేదాలను పక్కన పెట్టి క్యాడర్‌ను ఒక తాటిమీదకు తెచ్చేలా అధిష్ఠానం చర్యలు తీసుకొంది. టీడీపీకి పెద్ద దిక్కుగా వ్యవహరించిన వేనాటి రామచంద్రారెడ్డి పార్టీని వీడినా కేడర్ మాత్రం పార్టీకి వెన్నుదన్నుగా నిలబడింది. వైసీపీ నుంచి రఫీ, పుట్టు రమణమూర్తి, తాటిపర్తి శ్రీనివాసులరెడ్డి, నలుబోయిన రాజసులోచనమ్మ వంటి నాయకులు టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె విజయశ్రీని అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీలో అన్ని వర్గాలూ కలసి పనిచేస్తున్నాయి. పరసారత్నం వంటి నాయకులు కూడా ఆమె అభ్యర్థిత్వానికి జై కొట్టారు. బీజేపీ, జనసేన జత కట్టడం టీడీపీకి కలిసొచ్చే అంశం. గత ఎన్నికల్లో జనసేనకు ఇక్కడ 5,513, బీజేపీకి 1729 ఓట్లు పోలయ్యాయి. ప్రచారంలో కూటమి పక్ష శ్రేణులు చురుగ్గా పాల్గొనడంతో టీడీపీలో చాన్నాళ్ల తర్వాత సమరోత్సాహం వెల్లివిరుస్తోంది.

కాంగ్రెస్ ఓట్లతో వైసీపీకి ముప్పు

కాంగ్రెస్ తరఫున నాయుడుపేటకు చెందిన గాడి తిలక్‌బాబు బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2698 ఓట్లు వచ్చాయి. ఈసారి ఓట్లు పెరుగుతాయని ఆపార్టీ వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. వీరి ఓట్లశాతం పెరిగితే వైసీపీకి నష్టమని రాజకీయ పరిశీలకుల అంచనా.